కల్లాలపై రైతుల నిరాసక్తి


సాసనూలులో ఏర్పాటు చేసిన రైతు కల్లం

- పెరిగిన నిర్మాణం ఖర్చు.. ఆసక్తి చూపని రైతులు
- మంజూరై ఏడేళ్లైనా పూర్తి కాని పనులు.
- దరఖాస్తులు వేలల్లో.. పూర్తయింది వందల్లో..
- అవగాహన లేకపోవడంతో ముందుకురాని వైనం..
- జాబుకార్డు ఉన్నోళ్లే అర్హులంటున్న అధికారులు..

ఆయా మండలాల వారీగా వివరాలు..

మండలం	మంజూరు	పూర్తయినవి
ఇటిక్యాల	238	58
మానపాడు	110	104
ఉండవెల్లి	123	66
అలంపూర్	184	33
రాజోలి	196	84
వడ్డేపల్లి	174	60
అయిజ	256	106

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణ ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోంది. అందులో భాగంగానే రైతుల అభివృద్ధి కోసం రైతు వేదికలతో పాటు కల్లాల నిర్మాణాలు చేపట్టింది. నియోజకవర్గం వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారికి సిమెంట్, కాంక్రీట్‌తో నేరుగా రైతుల పొలాల్లోనే కల్లాలను నిర్మిస్తున్నారు. వాటి నిర్మాణానికి కావలిసిన నిధులు ఉపాధి హామి పథకం ద్వారా మంజూరు చేసింది. వాటిని నిర్మించడం వల్ల రైతులు పండించిన పంటలను ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా కల్లాల్లోనే ఆరబెట్టుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో నియోజకవర్గానికి గతంలో 1281 యూనిట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 511 యూనిట్లను మాత్రమే రైతులు నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన 770 యూనిట్లలో అవగాహన లోపం వల్ల కల్లాల నిర్మాణం పనులను నేటికీ ప్రారంభించ లేదు.

దరఖాస్తు చేసినా ఆసక్తి లేదు..

కల్లాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మంది రైతులు మంజూరైనా నేటికీ నిర్మాణం పనులు చేపట్టలేదు. ప్రభుత్వం నుంచి కల్లాల నిర్మాణం కోసం అనుమతులు వచ్చినా నిర్మాణ ఖర్చు ఎక్కువ అవుతుండటంతో చాలా మంది రైతులు వెనక్కి జంకుతున్నారు. పంట పొలాల్లోనే నిర్మించుకోవాలని అధికారులు చెప్పడంతో స్థలం వాటికి కేటాయిస్తే ఉన్న కొంచెం పొలంలో పంట తగ్గుతుందని బావించి సన్నకారు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు. కానీ కల్లాలను నిర్మించుకొని ప్రతి పంటను ఆరబెట్టి అమ్మితే మంచి ధరలు వస్తాయని రైతులకు అధికారులు సూచనలు ఇస్తున్నారు.


ఇటిక్యాలలో రైతు నిర్మించుకున్న కల్లాన్ని పరిశీలిస్తున్న అధికారులు.

కల్లాలకు అనుమతి ఇలా..

కల్లాల నిర్మాణాన్ని అధికారులు మూడు రకాలుగా విభజించారు. రైతులకు తమ పొలాల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి ఏవిధంగా నిర్మించాలో అధికారులు అనుమతి ఇస్తున్నారు. దీనిలో భాగంగా 50 మీటర్ల (538 చ.అ) కల్లాన్ని నిర్మిస్తే రూ.56,187, 60 మీటర్లకు (645 చ.అ) రూ.68వేలు, 75 మీటర్లకు (807 చ.అ) గాను రూ.85వేల చొప్పున నిధులను మంజూరు చేస్తున్నారు.

అవగాహన కల్పించాలి..



మా గ్రామంలో ఇరవై యూనిట్లకు పైగా రైతు కల్లాలు మంజూరయ్యాయి. కానీ కల్లాల నిర్మాణాలు చేపట్టేందుకు అవవగాహన లోపంతో రైతులు ముందుకు రావడం లేదు. గ్రామంలో ఇప్పటి వరకు కేవలం రెండు యూనిట్లను మాత్రమే నిర్మించారు. స్థానిక అధికారులు గ్రామాల్లో పర్యటించి కల్లాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. ముఖ్యంగా కల్లాల నిర్మాణం చేసుకున్న రైతులకు కూడా సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మన్న, రైతు, సాసనూలు

సద్వినియోగం చేసుకోవాలి



మండలంలో ఇప్పటివరకు 238 మంది రైతులు కల్లాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి దరఖాస్తు చేసుకున్న రైతులకు అందరికి ప్రభుత్వం నుంచి అనుమతులొచ్చాయి. కానీ నిర్మాణం ఖర్చులు పెరగడంతో రైతులు కల్లాలను నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. ప్రతి రైతు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వాటికి అయ్యే ఖర్చంతా ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. కల్లాలు పంటలను ఎండబెట్టుకోవడానికి రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

– అనిల్, ఏపీఓ, ఇటిక్యాల

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



అయిజ: ఈడుగోనిపల్లిలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సంకాపురం రాముడు బుధవారం రాత్రి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రూ.50,000 విరాళం అందజేశారు. వాల్మీకి మహర్షి ముందుగా దారిదోపిడీలకు పాల్పడి అనంతరం మహర్షిగా పరిణతి చెంది రామాయణాన్ని రాశారని అన్నారు. ప్ర తి మనిషి పరిణతి చెంది సన్మార్గంలో నడవా లని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వాల్మీకి మహర్షి సంఘం నాయకులు పాల్గొన్నారు.

13న ఫర్నీచర్ వేలం

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని కాల పరిమితి దాటిన ఫర్నీచర్‌ను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలిచిన వారు 13వ తేదీన ఉదయం 11 గంటలోపు రూ.వెయ్యి డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నవచ్చని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో మెట్లపూజ

అయిజ: పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మ



ప్ప స్వామి ఆలయంలో గురువారం భ క్తులు గోవింద స్వా ముల వారి మెట్ల పూజను భక్తి శ్రద్ధల తో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తిమ్మప్ప స్వామికి అభిషకాలు చేశారు. అదేవిధంగా గోవింద స్వాములవారి మాల ధరించిన భక్తులు మహాపూజ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

అంగన్‌వాడీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

మల్దకల్: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాలమ్మ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బరువు, ఎత్తు, తక్కువగా ఉన్న పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వారికి పౌష్టికాహారం సక్రమంగా అందేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

మల్దకల్: మొక్కల పెంపకంపై నర్సరీ నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కృష్ణయ్య టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే హరితహా రం నాటికి నర్సరీలలో మొక్కలను పెంచి సంరక్షించాలన్నారు. లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచాలని, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హె చ్చరించారు. రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలను పెంచి పోషించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

బైక్ చోరీ-కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని పెట్రోల్ బంక్‌లో బొంకూరుకు చెందిన మద్దిలేటి బైక్ ఈ నెల 6న ఉదయం పెట్టి వెళ్లా డు. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా కనబడకపోవడంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫి ర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు.

సెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఏ తెలుగు పూర్తి చేసిన విద్యార్థిని బి.పద్మ స్టేట్ ఎలిజిబులిటీ టెస్టు ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి, సహాయ ఆచార్య అర్హతను పొందింది. ఈ నేపథ్యంలో పద్మను ప్రిన్సిపాల్ చవ్వా వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

వేంకటేశ్వరస్వామికి ఎమ్మెల్యే పూజలు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలిసిన పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ సిబ్బంది ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందితే ఆలయంలోని 101 టెంకాయలుతో మొక్కులు చెల్లిస్తామని బీఆర్ఎస్ నాయకులు గోపి మొక్కుకోవడంతో వారి ఆధర్యంలోని ఎమ్మెల్యే 101 టెంకాయిలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్, ఆంజనేయులు, గోపి, రవి ఉన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

ఉత్తీర్ణత సాధించిన అధ్యాపకుడికి సన్మానం


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం బోధిస్తున్న అతిథి అధ్యాపకుడు చంద్రశేఖర్ స్టేట్ ఎలిజిబుల్ టెస్టులో ఉత్తీర్ణత సాధించారు. ఈ నేపథ్యంలో గురువారం కళాశాలలో చంద్రశేఖర్‌ను ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపక బృందం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు కష్టపడి చదివి ఉన్నత అర్హతలు పొంది, తద్వారా ఎన్నో విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం సభ్యులు ఉన్నారు.

సాధారణ ప్రసవాలను పెంచాలి

మానవపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను పెంచాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఇర్షాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలకు, వైద్య సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీణతకు గురైన వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. నవజాత శిశువుల పెరుగుదల కోసం 3నెలల నుంచి 15 నెలల వరకు తల్లీబిడ్డల సంరక్షణ కోసం ఎప్పటికప్పుడు సూచనలు చేయాలన్నారు. గ్రామాల్లో 30 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందించాలని ఆశాలకు, వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రిజ్వానా, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమలరావు, సోని సంధ్య, అనూష, పరిమళ, రషీదు, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఇర్షాద్

వాగుపై వంతెన నిర్మించండి


సింధనూర్ వద్ద వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

అయిజ: మండలంలోని సింధనూర్ గ్రామం వద్ద వాగుపై వంతెన నిర్మించక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి ఆయా గ్రామాల ప్రజలు ప్రతిరోజు ప్రయాణం చేస్తుంటారు. వాగు ప్రదేశంలో వంతెన నిర్మించకుండా కొన్ని సంవత్సరాల క్రితం సీసీ బెడ్డు నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో ఎరువులు, పురుగు మందులు కొనేందుకు ప్రతిరోజు రైతులు ఎద్దులబండ్లు, ఆటోల్లో ప్రయాణం చేయాల్సి ఉంటుది. వాగులు వంకల నుంచి వచ్చిన వరుద నీరు వాగులో వేసిన సీసీ బెడ్డుపై ప్రవహించినంతసేపు ఆప్రదేశంలో ప్రయాణానికి ప్రతికూలత ఏర్పడుతుంది. దాని వల్ల సరైన సమయంలో ప్రజలు గమ్యాన్ని చేరుకునేందుకు వీలులేకుండా పోతుంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజేయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నూతన గృహప్రవేశాల కార్యక్రమాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు రామన్‌గౌడు, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, రవి, తదితర్లు పాల్గొన్నారు.


కంచుపాడులో ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే విజేయుడు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక



అలంపూర్: రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు మాంటిస్సోరి పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పీఈటీ శివ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జశ్వీన్‌రెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, పాఠశాల డైరెక్టర్ రవిప్రకాష్‌లు అభినందించారు. పాఠశాల పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కే.జశ్వీన్‌రెడ్డి అండర్-17 రాష్ట్ర క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ సోమనాద్రి క్రీడా ప్రాంగణంలో 67వ ఎస్‌జీఎఫ్ అండర్ – 17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు హాజరవుతారని తెలిపారు. క్రీడలు విద్యార్థులలో మానసిక వికాసానికి క్రమశిక్షణకు దోహద పడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

కొనసాగుతున్న నీటి ప్రవాహం


ఆర్డీఎస్ కెనాల్‌లో ప్రవహిస్తున్న తుమ్మిళ్ల లిఫ్ట్ నీరు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ శివారులో ప్రవహిస్తున్న ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం కొనసాగింది. కర్ణాటక పరిధిలోని టీబీ డ్యాంలో కేసీ కెనాల్ వాటాగా పెట్టిన ఇండెంట్ నీటితో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో తుమ్మిళ్ల సమీపంలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం మోటార్ ద్వారా ఆర్డీఎస్ డీ-23 వద్ద నీటిని పంపింగ్ చేస్తున్నారు. లిఫ్ట్ నీటితో ఆర్డీఎస్ కెనాల్ నిండుగా ప్రవహిస్తోంది. మరో మూడు రోజులపాటు నీటి ప్రవాహం కొనసాగుతోందని ఆర్డీఎస్ అధికారులు తెలిపారు.

రోడ్డు పనులు పూర్తయ్యేదెప్పుడో?

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ ప్రధాన రహదారిలో చేపట్టిన రోడ్డు పనులు పూర్తయ్యేదెప్పుడోనని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో రోడ్డు డివైడర్ పనుల నిమిత్తం చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉండటంతో రోడ్డుకు ఇరువైపుల పరిచిన కంకరతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తిచేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.


కంకర వేసి వదిలేసిన సైడ్‌రోడ్డు

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


ఉండవెల్లిలో రాజీవ్ గాంధీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


తక్కశిలలో ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు


మానవపాడులో సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ధరూరు: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం, మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ, సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సరిత తిరుపతయ్య నేతృత్వంలో బండ్ల చంద్ర శేఖర్‌రెడ్డి, బండ్ల రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో డీజే ఏర్పాటు చేశారు. స్థానిక వైస్సార్ చౌరస్తా నుంచి కురువ వీధి మీదుగా పాత బస్టాండ్, అంబేడ్కర్ చౌక్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణా సంచా కాల్చారు. అంతకు మందు గ్రామంలోని పుర వీధులగుండా బైక్ ర్యాలీ చేట్టారు. కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్ కనిపించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాకీర్, రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బండ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, డిష్ వెంకటేశ్వర్‌రెడ్డి, కురవ శ్రీను, మాజీ జెడ్పీటీసీ కర్రెన్న, సవారన్న, కపట్రాల వెంకట్‌రెడ్డి, రామిరెడ్డి, దేవన్న, కిష్టన్న, దావీదు, బాబు, సురేష్, అశోక్, మదిలేటి, బోయ మల్లి, బోయ శీను, నాగన్న, వెంకటేష్, మీసాల రామన్న, చాకలి మల్లి పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, తక్కశిల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి మండల నాయకులు పాలాభిషేకం, తక్కశిలలో రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

గట్టు: తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో మండల కేంద్రం, ఆరగిద్ద, మాచర్ల, బల్గెర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలను నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు బాణా సంచాను కాల్చి సంబరాలు చేశారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీధుల్లో బాణా సంచాను కాల్చుతూ ర్యాలీ చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొడంగల్‌కు చెందిన ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి తెలంగాణ రెండో సీఎంగా ప్రమాణస్వీకారం చేయడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయా కూడళ్లలో బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయా కూడళ్లలో బాణా సంచా కాల్చి ఘనంగా సంబరాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

అయిజ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను గెలుచుకొని ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని వెంకటాపురంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మిఠాయిలు పంచుకొని, బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

శాంతినగర్: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలోని రామాపురం గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. గ్రామం నడిబొడ్డులో బాణాసంచా కాల్చుతూ మిఠాయిలు పంచారు. ఉల్లాసంగా సంబరాల్లో పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బయలు దేరిన నాయకులు

కేటీదొడ్డి: మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో నిర్వహించిన రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమానికి వాహనాలలో బయలుదేరి వెళ్లారు. గ్రామాల్లోని బాణాసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


ఆరగిద్దలో బాణా సంచా కాల్చుతున్న నాయకులు


ధరూరులో ర్యాలీ..


అయిజలో బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ శ్రేణులు